ప్రత్యేకంగా భద్రత కల్పించాలి..



మహిళా వైద్యులకు ప్రత్యేకంగా భద్రత కల్పించాలి. వైద్య వృత్తిలో ఉన్నవారి భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సంఘటనలు జరిగిన తరువాత హడావుడి కాకుండా రక్షణకు కృషి చేయాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటన చాలా అమానుషం. ఈ విధమైన సంఘటనలు దేశంలో పునరావృతం కాకూడదు.

- డాక్టర్ ఆర్ఎల్వీ ఫణికుమార్, సీనియర్ వైద్యుడు



మహిళలకు రక్షణ కల్పించాలి

మహిళలకు రక్షణ కల్పించాలి. ఏ రంగంలోనైనా మహిళల భద్రత చాలా ముఖ్యం. కోల్‌కతా ఘటన దేశంలో ఎక్కడా పునరావృతం కాకూడదు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా ఆస్పత్రుల్లో మహిళా వైద్యులతో పాటుగా మహిళా సిబ్బంది సైతం 24 గంటలూ విధుల్లో ఉంటారు. వారి రక్షణకు కృషి చేయాలి.

- సాయిలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్, పట్టణ ఆరోగ్య కేంద్రం



క్లుప్తంగా

తెలుగు తల్లికి గౌరవమేదీ !



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): తెలుగు భాషా దినోత్సవ వేళ తెలుగు తల్లి విగ్రహం ఓ పూలదండకు నోచుకోలేదు. మా తెలుగు తల్లికి మల్లెపూల దండ అంటూ గీతాలను ఆలపించే వారికి కనీసం పార్కులో తెలుగు తల్లి విగ్రహం ఉందని గుర్తుకు రాకపోవడం నేటి పాలకుల తీరుకు నిదర్శనం. కేఎల్ రావు పార్కు మెయిన్ గేట్‌కు ఎదురుగా 2018లో తెలుగు తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కేఎల్ పార్కుకు కూతవేటు దూరంలో సర్కిల్–1 కార్యాలయం, అందులో అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి విధులు నిర్వహిస్తుంటారు. కనీసం తెలుగు భాషాదినోత్సవ వేళ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది గాని కనీసం ఓ పూల దండను తెచ్చి వేసింది లేదు. దీంతో పార్కులో వాకింగ్ వచ్చే కొంత మంది అక్కడే ఉన్న కొన్ని పూలను తీసి తెలుగు తల్లి విగ్రహం పాదాల వద్ద ఉంచి నివాళులు అర్పించారు..

ఎస్ఆర్ఆర్‌లో నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యాన నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా ప్రావీణ్యం పెంచుకోవాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య అధ్యాపకుడు డి.యుగంధర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులు అందజేత



విజయవాడస్పోర్ట్స్: జాతీయ క్రీడల్లో రాణించిన పలువురు రాష్ట్ర క్రీడాకారులకు గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులను ప్రధానం చేసినట్లు గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్ తెలిపారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాణించిన క్రీడాకారులు అక్షయిదాయాం, తమన్యు, తన్యు, హేమంత్, మురారి, ధరణిధర్‌రెడ్డి, యశ్వంత్ సూర్య, అఖిలాష్, షణ్ముక్, ప్రజ్ఞ, ఆశ్రిత్, నాగభువనలతో పాటు అథ్లెటిక్స్ క్రీడాకారుడు సత్యనారాయణ, హాకీ క్రీడాకారిణి మోహనలక్ష్మిలకు ఈ అవార్డులను తాడిగడపలోని రైఫిల్ షూటింగ్ అకాడమీలో గురువారం అందజేశారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డులను ప్రధానం చేశామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు గత పదేళ్లుగా ఈ అవార్డులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ అకాడమీ డైరెక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపీ పోలీస్ శిక్షకులు గమిడి సాంబశివరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగం హానికరం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యానికి ఎంతో హానికరమని.. మత్తు పదార్థాలతో జీవితం చిద్రమౌతుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.శేఖర్‌బాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన సింగ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'మత్తు పదార్థాలు–సాషల్ మీడియా దుర్వినియోగం' అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని సినిమాలు, సోషల్ మీడియాలో చూస్తున్న వీడియోల ద్వారా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారన్నారు. సోషల్ మీడియా–మాదకద్రవ్య వ్యసనాన్ని అధిగమించడానికి డాక్టర్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహాయక బృందాలు, వ్యవస్థీకృత చికిత్స సహాయం అవసరం అవుతుందన్నారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ యస్.దేవమణి మాట్లాడుతూ.. మానసిక వైద్యులు, సైకాలజిస్టే ఉచితంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. 94904–92020 నంబరుకు ఫోను చేసి ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. అంగన్ వాడీ ఏసీడీపీఓ జ్యోత్స్న, సింగ్‌నగర్ సెక్టార్ సూపర్‌వైజర్ వి.నాగమణి, సెక్టార్ విభాగాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మాతృభాషతోనే వ్యక్తిత్వ వికాసం

- ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు వెంకటరెడ్డి
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కేబీఎన్ కాలేజీలో మాట్లాడుతున్న ఆచార్య వెంకటరెడ్డి, వేదికపై అధ్యాపకులు



భాషా పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాతృభాషతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమని ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం, తెలుగు సంపద సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషా వికాసానికి అద్భుతమైన సేవలందించారన్నారు. తెలుగు భాషను వ్యవహారిక భాషగా ముందుకు తీసుకువెళ్లటంలో ఆయన అనేక రకాల కృషి చేశారని చెప్పారు. కావ్యభాష ఇతరాత్ర సాహిత్యాలకు ఎలా ఉన్నా వ్యవహారికంలో భాష చాలా సులభంగా అర్థమయ్యేరీతిలో ఉండాలని ఆయన ప్రచారం చేశారన్నారు. అంతేకాకుండా భాషను మరింతగా బతికించేందుకు, ముందు తరాలకు అందించేందుకు ఆయన కొనసాగించిన సేవలు అపూర్వమని కొనియాడారు. మాతృభాష వలన విజ్ఞాన శాస్త్రాల వికాసం సాధ్యమని, దాంతో పాటుగా సంస్కారం వర్ధిల్లుతుందన్నారు. దేశభక్తి పెంపొందటమే కాకుండా మానవ మనుగడకు మాతృభాష గొప్ప సాధనమని వివరించారు.

భాషా సంస్కృతుల పరిరక్షణకు కృషి..

సాహితీవేత్త డాక్టర్ వాడ్రేవు సుందరరావు మాట్లాడుతూ.. తెలుగు భాషా వైభవాన్ని వివరించారు. తెలుగు భాష సాహిత్యం, నాటకం వంటి అంశాలపై ఆయన ప్రసంగించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ భాషా సంస్కృతుల పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందుకు కేబీఎన్ కళాశాల యాజమాన్యం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలుగు సంపద సంస్థ ప్రధాన సలహాదారు డాక్టర్ మూర్తి రేమిళ్ల, లిపి గేమ్ ఇండియా ఉపాధ్యక్షురాలు అపర్ణ, హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ జేవీ చలపతిరావు, డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాతృభాషతోనే మనో వికాసం

విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనో వికాసం కలుగుతుందని కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. తెలుగు కళావాహిని ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్యా కళాక్షేత్రం వద్ద గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దిన వేడుకలను నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ.. తెలుగులో మాట్లాడటం ఆత్మగౌరవానికి నిదర్శనమన్నారు. తెలుగును విస్మరిస్తే భవిష్యత్‌లో యువత భవిత నిర్వీర్యమైపోతుందన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంగ్లంతో పాటు తెలుగు భాషకు సమాన గౌరవం ఇవ్వాలని సూచించారు. చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో మాతృభాషా వికాసానికి కృషి చేసిన సరకొండ రమాదేవి, నడకుదురు సుజాతమ్మ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రమేష్ దరిశిక, పీవీ నాంచార్మ, కొంపెల్ల శ్రీనివాసరావు, బెజగం రవికుమార్, వీవీ రత్నం, జేవీ చలపతిరావు, కుప్పా కృష్ణవేణి, చింతా వెంకటేశ్వర్లుకు భాషా పురస్కారాలను అందజేసి, సత్కరించారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ దిట్టకవి గోపాలాచార్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ దిట్టకవి గోపాలాచార్యులు అన్నారు. గాం. దీజీ మహిళా కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ గోపాలాచార్యులు మాట్లాడుతూ మాతృభాష అమ్మ ఒడి నుంచి ప్రారంభమవుతుందన్నారు. తెలుగు భాషా గొప్పతనాన్ని అర్థం చేసుకొని దానిపై మరింత పట్టు సాధించాలన్నారు. తెలుగు భాషా మాధుర్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతికాంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు కొత్తమాసు పిచ్చయ్య, ప్రిన్సిపాల్ రమణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కూరపాటి హైస్కూల్‌లో....

వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి 162వ జయంతి వేడుకలు కూరపాటి పాఠశాలలో గురువారం ఘనంగా జరిగాయి. ఆ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య ఆధ్వర్యంలో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. తొలుత గిడుగు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు వాడుకభాషలోకి తీసుకురావటానికి గిడుగు చేసిన కృషి అమోఘమన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కూరపాటి లక్ష్మీనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ పంచ హారతుల్లో భాగవతం పద్యాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ప్రతి రోజూ జరిగే పంచహారతుల సేవలో వేదస్వస్తితో పాటు భారత భాగవతంలో పద్యాలను పలకనున్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నూతన విధానానికి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీకారం చుట్టినట్లు ఆలయ ఈవో రామరావు పేర్కొన్నారు. గురువారం దుర్గమ్మ పంచహారతుల సేవలో వేద పండితులు వేదస్వస్తి, భాగవతంలోని తెలుగు పద్యాలను పలికారు. ఇకపై ప్రతి రోజూ పంచహారతుల సేవలో ఇదే రీతిలో కొనసాగుతుందన్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేం చేసి ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో గురువారం స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం భోగశ్రీనివాసునికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌తో పాటు ఉత్సవమూర్తికి ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్‌లు విశేష పుష్పార్చన, తులసీ దళార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఉభయ దాతలు, భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు లలితా సహస్రనామ ప్రాశస్త్యంపై ఉపన్యాసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా లలితా సహస్రనామ ప్రాశస్త్యంపై ఉపన్యాసం చేస్తారని నిర్వాహకులు జేవీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసంలో విశిష్టమైన లలితా సహస్రనామం గురించి ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామన్నారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే కఠిన చర్యలు



షాప్‌ను సీజ్ చేస్తున్న వీఎంసీ అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరంలో లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగర పరిధిలోని 45వ డివిజన్ ఏరియాలో రోటరీ నగర్‌లోని ఐరన్ స్క్రాప్ వ్యాపారస్తులకు 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు నోటీసులు ఇచ్చి ట్రేడ్ లైసెన్స్ తీసుకోమని సూచించినప్పటికీ సదరు వ్యాపారస్తులు స్పందించకపోవటంతో వీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం కరీముల్లా ఐరన్ స్క్రాప్ బిజినెస్, నేత్ర ఎంటర్‌ప్రైజెస్ డిస్పోజల్ షాపులను అధికారులు సీజ్ చేశారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి..

నగరంలో వ్యాపారం చేయాలనుకునే వారంతా ముందుగానే వీఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలని, ఇప్పటికీ పొందని వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటనే త్వరితగతిన వారికి లైసెన్స్‌లు మంజూరు చేస్తామని కమిషనర్ ప్రకటించారు. లైసెన్స్ లేని వ్యాపారస్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా నీటి కాలుష్యం వల్ల కలిగే డయేరియా, వాంతులు విరోచనాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ఆర్వో ప్లాంట్లు అన్నీ వారి నీటి శాంపిళ్లను ప్రతి నెల ప్రభుత్వ ల్యాబ్‌లో తనిఖీ చేయించి రిపోర్టును తమకు సమర్పించాలన్నారు. నోటీసులు జారీ చేసినా ఇంకా శాంపిళ్లను ల్యాబ్‌కు పంపని ప్లాంట్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మనిషిని ప్రజ్ఞావంతుడిగా నిలబెట్టటంలో భాష కీలకం

ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి రేమెళ్ల



సైంటిస్ట్ మూర్తిని సత్కరిస్తున్న ఉపాధ్యాయినులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సృష్టిలోని జీవరాశులన్నింటిలోనూ మనిషిని ఉన్నతుడిగా, ప్రజ్ఞావంతుడిగా నిలబెట్టగలిగిన అంశాల్లో భాష కీలకమైనదని ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి రేమెళ్ల పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవం, జాతీయ అంతరిక్ష వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ (డీఎస్ఎమ్) హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. డాక్టర్ మూర్తి మాట్లాడుతూ ఒక సమాజపు సంస్కృతి, నాగరికతలను తెలుసుకోవడానికి, వారసత్వంగా తరతరాలకు అందించడంలోను భాష ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగుకు పట్టం కడుతున్న రోజుల్లో ప్రజల వాడుక భాష ప్రాధాన్యత గుర్తించి వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడిగా నిలిచిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

క్రీడా దినోత్సవ స్ఫూర్తితో విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలో శిక్షణ పొంది రాణించాలని డాక్టర్ మూర్తి ఆకాంక్షించారు. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో ఇతర దేశాలపై ఆధారపడకుండా మనమే అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అన్నీ సమకూర్చుకోగలుతున్నామని చెప్పారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్, డీవీ మురళీ ప్రసాద్, శివ పార్వతి, జ్యోతిర్మయి, అనసూయ, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

ఎన్‌జీసీలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి



ఏకేటీపీ స్కూల్‌లో ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ హైస్కూల్‌లో నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను పర్యావరణ సంబంధిత కార్యకలాపాల్లో భాగస్వాములు చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి..

పాఠశాల, ఇంటి పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పరిసరాల పరిశుభ్రత తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం భోజనం సమయంలో మిగిలిపోయిన ఆహారాన్ని డస్ట్‌బిన్లలో మాత్రమే వేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్‌కు కావలసిన ప్రదేశాన్ని ఎన్నుకొని ఆకుకూరలు, కూరగాయలు పండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎకో క్లబ్ నూతన కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థులకు టీ షర్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు దేవరపల్లి సురేష్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శివ, డి.సీతా రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు అవమానించి.. నేడు కపట ప్రేమ ఒలకబోస్తున్నారు

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుల్లయ్య మండిపాటు



పుల్లయ్య

భవానీపురం (విజయవాడ పశ్చిమ): సమస్యలను విన్నవించుకునేందుకు వస్తే తోకలు కత్తిరిస్తా.. మిమ్మల్ని దేవాలయాల్లో అడుగు పెట్టనివ్వను అంటూ నాడు నాయీబ్రాహ్మణులను ఘోరంగా అవమానించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు నేడు వారికి అగ్రతాంబూలం ఇస్తున్నట్లు కపట ప్రేమ ఒలకబోస్తున్నారని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ టి.పుల్లయ్య గురువారం ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమం పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు ఇప్పుడిస్తున్న రూ.20 వేల జీతాన్ని రూ.25 వేలకు పెంచుతున్నట్లు, దేవాలయాల పాలకమండళ్లలో స్థానం కల్పిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించటం విడ్డూరంగా ఉందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ఆలయాల్లో సేవకులైన నాయీబ్రాహ్మణులను పాలకులుగా చేశారన్న సంగతిని చంద్రబాబు మరిచిపోయినట్లున్నారని గుర్తు చేశారు. నాయీబ్రాహ్మణులను ఎండోమెంట్ ఉద్యోగులుగా పరిగణించి జీతాలు పెంచింది కూడా వైఎస్ జగనే అని చెప్పారు.

స్టేజ్ 3 నాలుక క్యాన్సర్‌కు విజయవంతంగా చికిత్స



డాక్టర్ సాయిస్నేహిత్, రేడియేషన్ ఆంకాలజిస్ట్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): తీవ్రస్థాయి నాలుక క్యాన్సర్‌తో బాధపడుతున్న 91 ఏళ్ల రోగికి విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో విజయవంతంగా చికిత్స అందించినట్లు రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయిస్నేహిత్ తెలిపారు. విజయవాడకు చెందిన సూరపనేని రాధాకృష్ణమూర్తి తన నాలుక కుడి వైపున పుండు ఉందని, అది నొప్పిని కలిగించడంతో పాటుగా తినేటప్పుడు మంటగా ఉంటుందనే సమస్యతో ఆస్పత్రికి వచ్చారన్నారు. అతని వయస్సు, క్యాన్సర్ దూకుడు స్వభావం కారణంగా ఆ కేసు చాలా సవాలుగా మారిందని తెలిపారు. అయినప్పటికీ అధునాతన సదుపాయాలు అందుబాటులో ఉండటంతో రేడియోథెరపీ పద్ధతులతో దుష్ప్రభావాలను తగ్గించి, కణితిని లక్ష్యంగా చేసుకుని సమర్థవంతంగా చికిత్స అందించామన్నారు. అతను పురోగతి సాధించడం చాలా సంతోషంగా ఉందని డాక్టర్ సాయి స్నేహిత్ అన్నారు. సంక్లిష్ట క్యాన్సర్‌ను ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు అధునాతన పరికరాలు అందుబాటులో ఉండటం వలనే విజయవంతంగా చికిత్స అందించగలిగామని ఆయన తెలిపారు.

గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను అరికట్టాలి



జక్కంపూడి కాలనీలో ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీలో చీకటి పడితే బ్లేడ్, గంజాయి బ్యాచ్ ఆగడాలు మితిమిరిపోతున్నాయని కాలనీకి చెందిన పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీకి చెందిన పలు బ్లాకుల వద్ద ప్రతి రోజూ ఇదే పరిస్థితి ఉందంటూ మహిళలు రోడ్లపైకి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు మాట్లాడుతూ.. రాత్రి వేళ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లాలన్నా భయపడాల్సి వస్తోందన్నారు. ఇంటి ముందు నిలిపిన ఆటోలు, బైక్‌లపై కూర్చుని గంజాయి తాగుతున్నారని, ఇదేమిటని అడిగితే దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఇంటి ఆవరణలో ఉంచిన సామగ్రిని సైతం చోరీ చేస్తున్నారన్నారు. దీనికి తోడు కాలనీలోని కొంత మంది తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మద్యం విక్రయాలు చేస్తున్నారని, మద్యం తాగిన వారు వీరంగం సృష్టిస్తున్నారని చెప్పారు. కాలనీలో ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించాలంటే పోలీసులు గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని కోరారు. ఇటీవల కాలనీలోని కేబుల్ కార్యాలయంలో కొంత మంది గంజాయి బ్యాచ్ సభ్యులు దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారని కేబుల్ ఆపరేటర్ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో అవుట్ పోస్టును మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే నగర కమిషనర్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామని చెప్పారు.

మధురంగా సాగిన లయ విన్యాసం



మృదంగ లయ విన్యాసం నిర్వహిస్తున్న బాల కళాకారులు

విజయవాడ కల్చరల్: లయ కళానాద స్రవంతి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా ఐదు రోజుల పాటు నిర్వహించే సంస్మరణ సంగీతోత్సవాలు శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం ప్రారంభమయ్యాయి. శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ కళాకారులు నిర్వహించిన గాత్ర కచేరీలు, లయ విన్యాసం, మృదంగ విన్యాసం ఆకట్టుకున్నాయి. సంగీత విద్వాంసురాలు ఆర్.విజయలక్ష్మి వయోలిన్‌పై సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. నోరి లక్ష్మీ మనోజ, నోరి గాయత్రి వాగ్గేయకార కీర్తనలను గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు సంగీత కళాశాల విద్యార్థులు నిర్వహించిన లయ విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ నిర్వాహకురాలు కె.మాధవి నిర్వహించారు. పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పాయకాపురం(విజయవాడరూరల్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్ పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ క్రీడా ఉపాధ్యాయిని ఉమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలుగు భాషా దినోత్సవం గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

శ్రీదత్తసాయి మందిరంలో పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. శ్రీ సాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. 500 మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది.